క్లుప్తంగా

గోడిలంక రైసుమిల్లు వద్ద బారికేడ్ల ఏర్పాటు



గోడిలంక ప్రమాదకర మలుపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఈ అంబేడ్కర్

అల్లవరం: 'ప్రాణాలు పోతున్నా పట్టింపేది' శీర్షికన సాక్షి దినపత్రికలో ఈ నెల 1వ తేదీన ప్రచురించిన కథనానికి ఆర్అండ్బీ అధికారులు, పోలీసులు స్పందించారు. గోడిలంక రైసుమిల్లు సమీపంలోని ప్రమాదకర మలుపు వద్ద అల్లవరం పోలీసులు రోడ్డుకి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటుచేసి వాహనాల వేగాన్ని నియంత్రించారు. ఆర్అండ్బీ ఏఈ అంబేడ్కర్ ప్రమాదకర మలుపు ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. రోడ్డుకి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మిస్తామని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, తులసీదాస్, స్థానికులు ఉన్నారు.

వరద బాధితులకు మంచినీటి బాటిళ్ల తరలింపు



విజయవాడకు మినీ లారీని పంపిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ నాగేంద్రమణి, అధికారులు

అమలాపురం టౌన్: విజయవాడ వరద బాధితుల కోసం అమలాపురం మున్సిపాలిటీ తన వంతు సాయంగా మంచినీటి బాటిళ్లు, ప్యాకెట్లు సమకూర్చింది. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మినీ లారీలో 10 వేల వాటర్ బాటిళ్లు, 10 వేల వాటర్ ప్యాకెట్లను లోడ్ చేసి మున్సిపల్ సిబ్బంది విజయవాడ తీసుకెళ్లారు. మున్సిపల్ చైర్పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మున్సిపల్ మేనేజర్ ఎంవీఎస్ఎన్ మూర్తి, ఏఈ భాస్కర్లు మినీ లారీని దగ్గరుండి విజయవాడకు పంపించారు. అక్కడ మున్సిపల్ సిబ్బంది బాధితులకు స్వయంగా వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు పంచుతారని చైర్పర్సన్ సత్య నాగేంద్రమణి తెలిపారు.

నేతాజీకి సత్యనాగేంద్రమణి పరామర్శ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీని మున్సిపల్ చైర్పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, రెడ్డి సత్యనారాయణ తదితరులు బుధవారం పరామర్శించారు. నేతాజీ తల్లి పాపాయమ్మ(83) చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెరువుల్లా చేలు.. అన్నదాతలకు కన్నీళ్లు

- అధిక వర్షాలతో వరి పంటకు తీవ్ర నష్టం
- కుళ్లి పాడైపోతున్న వరినాట్లు
- ఈ ఏడాది ఖరీఫ్లో రైతన్నలకు అష్టకష్టాలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

తాళ్లరేవు: ఒకవైపు గోదావరి వరద, మరోవైపు భారీ వర్షాల కారణంగా ఈ ఏడాది తొలకరిలో రైతుల కళ్లల్లో కన్నీటిసుడులు తిరుగుతున్నాయి. నారుమడులు వేసుకోగానే గోదావరి వరద వచ్చి పొలాలను ముంచెత్తడంతో కష్టమంతా వరద పాలైంది. దీంతో రైతులంతా మళ్లీ పెట్టుబడులు పెట్టి నారుమడులు వేసుకుని, విత్తనాలు పోసుకుని సాగు సాగించారు. ఇప్పుడేమో గత 20 రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా మళ్లీ పొలాలన్నీ ముంపుబారిన పడ్డాయి. గ్రామాల్లో ఎటుచూసినా చేలన్నీ చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో వరినాట్లు కుళ్లిపోయి ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. దీంతో అన్నదాతలంతా కన్నీరుమున్నీరవుతున్నారు.



మురమళ్లలో నీట మునిగిన వరి పొలాలు

ప్రభుత్వం ఆదుకుంటేనే కోలుకునేది

ఈ ఏడాది ఖరీఫ్లో అమలాపురం నియోజకవర్గంలో 11,411 ఎకరాల్లో, ముమ్మిడివరం నియోజకవర్గంలో 25,065 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. గత 20 రోజులుగా నిరంతరాయంగా వర్షం పడడం, గోదావరి వరదల నేపథ్యంలో పంట కాలువల్లో నీరు అధికంగా ఉండడంతో వందల ఎకరాల మేర వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. చేలల్లో మోకాల్లోతు నీరు నిల్వ ఉండిపోవడంతో వరినాట్లు కుళ్లిపోతున్నాయని, ఇప్పటికే ఖరీఫ్ తీవ్ర జాప్యమైన నేపథ్యంలో మళ్లీ విత్తనాలు వేసే అవకాశం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు ప్రారంభంలోనే అటు వరుణుడు, ఇటు గోదారమ్మ ఉగ్రరూపం దాల్చడంతో ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా తమ పరిస్థితి తయారైందని గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటే తప్ప తాము కోలుకునే అవకాశం లేదని, తక్షణమే అధికారులు పంట నష్టం అంచనా వేసి సాయాన్ని అందించాలని వేడుకుంటున్నారు. మరోవైపు సాగు ప్రారంభంలో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని కూటమి నేతలు చెప్పినా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. పీఎం కిసాన్ నిధులు అకౌంట్లలో జమవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్పందించకపోవడంతో ప్రభుత్వ సాయం కోసం రైతులకు ఎదురుచూపులే మిగిలాయి.

మళ్లీ గోదావరికి వరదొస్తుందా?

బుధవారం సాయంత్రానికి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఐదు లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశామని, గురువారం ఉదయానికి 10 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని తూర్పుగోదావరి జిల్లా అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు రానున్న రెండు మూడు రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో మళ్లీ గోదావరికి వరద వస్తుందేమోనని అన్నదాతలు భయపడుతున్నారు. అదే జరిగితే గ్రామాల్లో మిగిలిన పొలాలు సైతం ముంపుబారిన పడడం ఖాయమని ఆందోళనకు గురవుతున్నారు.



లచ్చిపాలెంలో ముంపు బారిన పడిన పొలాలు

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి నాట్ల వివరాలు

మండలం	దెబ్బతిన్న వరినాట్లు (ఎకరాల్లో)
తాళ్లరేవు	400
కాట్రేనికోన	300
ఐ.పోలవరం	250
ముమ్మిడివరం	100
అల్లవరం	300
ఉప్పలగుప్తం	150
అమలాపురం	50

ప్రభుత్వం ఆదుకోవాలి



ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుచేసి వేసిన వరి నాట్లు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. వరదల కారణంగా ఒకసారి పంట పాడైపోతే మళ్లీ వెదజల్లు సాగు చేపట్టాం. గత కొద్దిరోజులుగా ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో పంట పాడైపోతుంది. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– అనిశెట్టి బుల్లియ్య, రైతు, లచ్చిపాలెం

నత్తనడకన ఈ-పంట



ఈ-పంట కార్యక్రమం నత్తనడకగా సాగుతోంది. సాగు ప్రారంభించి రెండు నెలలు పూర్తవుతున్నా ఇప్పటివరకు ఈ-పంట పూర్తి కాలేదు. ఇప్పటికే వరదలు, భారీ వర్షాల కారణంగా నష్టం జరిగింది. ఆ నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు. త్వరితగతిన ఈ-పంట పూర్తిచేసి రైతులకు అండగా నిలవాలి.

– పాలెపు ఈశ్వరరావు, రైతు నాయకుడు, పోలేకుర్రు

విద్యాభివృద్ధికి కిరణ్బాబు కృషి

ఉప్పలగుప్తం: మండల విద్యాశాఖధికారిగా కె.కిరణ్బాబు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ఎంఆర్సీ భవనంలో ఆయనను సత్కరించారు. కిరణ్బాబుకు యుటీఎఫ్, ఎస్టీయూ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు ఎ.సురేష్కుమార్, ఎ.చంద్రసూర్యం, జి.సుబ్రహ్మణ్యం, ఎస్టీయూ నాయకులు వై.శ్రీనివాస్, ఎస్.రుషేంద్రకుమార్, సీహెచ్ మైనర్బాబు తదితరులు పాల్గొన్నారు.

మోహన్కృష్ణ సేవలు అభినందనీయం



సూపరింటెండెంట్ మోహనకృష్ణను సత్కరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: మండలంలో సుదీర్ఘకాలం పాటు సేవలందించిన చింతా మోహనకృష్ణ సేవలు అభినందనీయమని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్గా సేవలందిస్తున్న మోహనకృష్ణ కాకినాడ డ్వామా కార్యాలయానికి బదిలీపై వెళుతుండడంతో బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు డొమ్మేటి శామ్యూల్సాగర్, కుడుపూడి శివన్నారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, పి.రామలక్ష్మి, గంజా సూరిబాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

తాళ్లరేవు: ఎడతెరిపి లేని వర్షాలు, గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. బుధవారం పిల్లంక శివారు కొత్తలంక గ్రామంలో ఆయన పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వరద పరిస్థితిని ఎంపీడీఓ ఎం.అనుపమ, ఇన్చార్జ్ తహసీల్దార్ టి.సూరిబాబులను అడిగి తెలుసుకున్నారు. వరద వచ్చినపుడు తమకు తాగునీటి సమస్య అధికంగా ఉంటుందని, అలాగే పశువులకు ఆహార కొరత ఏర్పడుతుందని తెలిపారు. దీనిపై ఆర్డబ్ల్యూఎస్ ఏఈ టి.మారుతీరావుతో కలెక్టర్ మాట్లాడి వివరాలు కోరారు. గ్రామానికి పీహెచ్సీ దూరంగా ఉండడంతో అంబులెన్స్తో పాటు ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించాలని ఆదేశించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఉప్పలగుప్తం: భారీ వర్షాలు, తుపాను నేపథ్యంలో మండల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ ప్రత్యేకాధికారి (సమగ్ర శిక్షా ఏపీడీ) ఎ.మధుసూదన్రావు అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం వానపల్లిపాలెం, గొల్లవిల్లి గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, తహసీల్దార్ వీఎస్ దివాకర్, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, వ్యవసాయాధికారి జి.కుమార్బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్, ఎంఈవో ఎస్.సత్యకృష్ణ, వైద్యాధికారులు నాగార్జున, లోవసుధ, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.



కొత్తలంకలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షన్మోహన్



ఉప్పలగుప్తంలో అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మధుసూదన్రావు

మండల అధికారులతో సమీక్ష

అల్లవరం: గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక అధికారులతో బుధవారం ఎంపీడీఓ కృష్ణమోహన్ సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఓడలరేవు నుంచి బోడసకుర్రు వరకూ ఏటిగట్టును పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా గండ్లు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. అవసరాన్ని బట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడితే జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరదలను ఎదుర్కొవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, పరిపాలనాధికారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

అమలాపురం రూరల్: మండలం నుంచి జిల్లాకు 8 మంది ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికయ్యారని ఎంఈవో గుబ్బల సూర్యప్రకాష్ బుధవారం తెలిపారు. పేరూరుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నయనాల రాజరాజేశ్వరి, ఇందుపల్లి బీవీపీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆకెళ్ల బుజ్జి, రెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు గంటా వనితకుమారి, జనుపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మంగం సుధాకర్, నవరప్పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లక్కింశెట్టి వీరలక్ష్మీ ప్రమీలాదేవి, ఎంఆర్ కాలనీ ఉపాధ్యాయుడు కొండేపూడి సోనీకుమార్, అమలాపురం పట్టణంలోని పేరమ్మ అగ్రహారం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బుంగా రామకృష్ణ, పొట్టి శ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయరాలు యనమదల యామమ్మ ఎంపికయ్యారన్నారు. వారికి ఆయన అభినందనలు తెలియజేశారు.

ఐ.పోలవరం: కొమరగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లాటి శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఆయను సర్పంచ్ విజయ చాముండేశ్వరిదేవి, పాఠశాల కమిటీ చైర్మన్ గరగ రాంబాబు, మాజీ సర్పంచ్ గాదెరాజు బుచ్చికృష్ణ తదితరులు అభినందించారు.

పుదుచ్చేరిలో 21 మందికి అవార్డులు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసేవలందిస్తున్న 21 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రకటించినట్లు విద్యాశాఖ డైరెక్టర్ పి.ప్రియదర్శిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.ఉమాదేవి, విజయన్, చార్లెస్పాల్కు డాక్టర్ రాధాకృష్ణన్ అవార్డు, కలైవాణి, చిత్ర, జగదీశ్వరి, ఆర్.హేమలత, గజలక్ష్మి, నళినీదేవిలకు చీఫ్ మినిస్టర్ స్పెషల్ అవార్డు, ఎస్ మురళి, వి.తిరునానసంబంధన్, తిరునారాయణ, అర్జమున, అర్గణపతి, వివేకానందన్, వి.పరేమేశ్వరిలకు ఎడ్యుకేషన్ మినిస్టర్ రీజినల్ అవార్డులను గురువారం పుదుచ్చేరిలో జరిగే ఉపాధ్యాయదినోత్సవం రోజున అందజేస్తారన్నారు.

ఓడలరేవు జెట్టీని పరిశీలించిన కలెక్టర్

అల్లవరం: గోదావరి, దాని ఉప నదులకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున మండల స్థాయి అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మహేష్కుమార్ ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అల్లవరం మండలంలోని ఓడలరేవు గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఓడలరేవు చేపల మార్కెట్లో నిర్మించిన జెట్టీని పరిశీలించి జెట్టీ పనులు మధ్యలోనే నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జెట్టీతో పాటుగా ఆక్షన్ హాలు, ఇతర భవనాలను ఎప్పుడు నిర్మిస్తారో చెప్పాలని హెడ్వర్క్స్ అధికారులను ఆరా తీశారు. జెట్టీ వినియోగంలో ఉందని, మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హెడ్వర్క్స్ అధికారులు బదులిచ్చారు. అనంతరం గోడితిప్ప పంచాయతీ పరిధిలోని గోపాయిలంక వద్ద అవుట్ ఫాల్ స్లూయిజ్ను పరిశీలించారు. స్లూయిజ్కు ఉన్న 8 గేట్లు పాడవ్వడంతో వరద నీరు కుమ్మరి కాలువలోకి వస్తుందని డ్రైన్ అధికారులు కలెక్టర్కు తెలిపారు. పాడైన గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తే ముంపు సమస్య ఉండదన్నారు. పంట పొలాలు ముంపు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయన తహసీల్దార్ ఎస్వీ నరసింహరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఈలు సునీతాదేవి, స్వామి, సంపన్, రెహమాన్, సర్పంచ్లు రొక్కాల విజయలక్ష్మి, చిట్టినీడి శ్రీదేవి, మల్లాడి ఉమామహేశ్వరరావు, చొల్లంగి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సర్వేపల్లి చిత్రం



అమలాపురం రూరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వేసిన పెయింటింగ్ అందరినీ ఆకట్టుకుంటుంది.

జిల్లాలో 66.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

అమలాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ జిల్లా వ్యాప్తంగా 66.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొత్తపేట మండలంలో 109.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మలికిపురం మండలంలో 10.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని ఆలమూరు మండలంలో 79.2 మి.మీ, కపిలేశ్వరపురం మండలంలో 76.6 మి.మీ., రావులపాలెం 76.2 మి.మీ., ఆత్రేయపురం 68.2, అల్లవరం 57.8, అయినవిల్లి 50.6, ముమ్మిడివరం 45.2, ఐ.పోలవరం 42.8, మామిడికుదురు 45.2, కాట్రేనికోన 41.2, రాయవరం 54.6, అంబాజీపేట 38.6, ఉప్పలగుప్తం 38.6, అమలాపురం 31.8, సఖినేటిపల్లి 15.0, మండపేట 25.2, రాజోలు 22.2, పి.గన్నవరం 28.4, కె.గంగవరం 49.2, రామచంద్రపురం మండలంలో 16.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

అల్లవరం: స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం గూడాల పంచాయతీ పరిధిలోని వీరమ్మ చెరువు వద్ద పేకాట శిబిరంపై అల్లవరం పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

విశ్రాంత వీఆర్ఓకు గాయాలు

ముమ్మిడివరం: విశ్రాంతి వీఆర్ఓ అనుపిండి సూరిబాబు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన సూరిబాబు బుధవారం ద్విచక్రవాహనంపై అనాతవరం నుంచి అమలాపురం వెళుతుండగా అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సూరిబాబును స్థానికులు అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అలైన్మెంట్ మార్చాలంటూ వినతి

అమలాపురం టౌన్: చిందాడగరువులో ఉన్న అమలేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న చెరువుకు ఇబ్బంది కలగకుండా కోటిపల్లి- నర్సాపురం రైల్వే లైన్ అలైన్మెంట్ను మార్చాలని కోరుతూ జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. అమలేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న దాదాపు 17 ఎకరాల చెరువు(మడుగు)లో ప్రతి పుష్కరాలకు వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తారని వివరించారు. ఆ చెరువు మీదుగా రైల్వేలైన్ వెళితే భక్తుల మనోభావాలు దెబ్బ తింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

వరద బాధితులకు రూ.20 వేల సాయం

అమలాపురం రూరల్: అమలాపురం శ్రీరామపురానికి చెందిన దస్తావేజు లేఖరి మట్టపర్తి శ్రీరాములు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.20 వేలను ముఖ్యమంత్రి సహాయనిధికి ఇచ్చారు. శ్రీరాములు తన కుమార్తె లక్ష్మీకార్తీక సౌందర్య కోరిక మేరకు బుధవారం సాయంత్రం కలెక్టరేట్లో కలెక్టర్ మహేష్కుమార్కు కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబీకులను కలెక్టర్ మహేష్కుమార్ అభినందించారు.



కలెక్టర్ మహేష్కుమార్కు చెక్కు అందజేస్తున్న చిన్నారి లక్ష్మీకార్తీక సౌందర్య, శ్రీరాములు

ముంచెత్తిన వాన

- పల్లపు ప్రాంతాలు జలమయం
- ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజల అవస్థలు



కేశనకుర్రు చాకిరేవు వద్ద నీట మునిగిన రహదారి

అమలాపురం టౌన్: వర్షాలు ఆగినట్లే ఆగి బుధవారం తెల్లవారుజాము నుంచి మళ్లీ ఎడతెరిపి లేకుండా కురవడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. పట్టణంలోని కొన్ని పల్లపు ప్రాంతాలు అధిక వర్షాలకు ముంపు బారిన పడ్డాయి. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి కొంత తెరిపి ఇచ్చినా చిరు జల్లులు పడుతూనే ఉన్నాయి. భారీ వర్షం కారణంగా పట్టణంలోని 60 శాతం దుకాణాలు తెరుచుకోలేదు. అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో జిల్లా కలెక్టర్ విద్యాలయాలకు బుధవారం సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లకే పరిమితయ్యారు. పట్టణంలోని సావరం, కార్మిక నగర్, అశోక్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీలో పలు అంతర్గత రోడ్లు వర్షాలకు ముంపునకు గురయ్యాయి. అమలాపురం ఆర్టీసీ బస్స్టేషన్లో కూడా ఇన్ గేట్ వద్ద సీసీ ప్లాట్ఫాం పైకి ముంపు నీరు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేసినా వర్షాల కారణంగా ఖాళీగా దర్శనమిచ్చాయి.

జల దిగ్బంధంలో ఎస్ఈబీ కార్యాలయం

స్థానిక నల్ల వంతెన దిగువన గల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) డివిజన్ కార్యాలయం అధిక వర్షాలకు జల దిగ్బంధంలో చిక్కుకుంది. ఎక్సైజ్ స్టేషన్, ఎస్ఈబీ స్టేషన్ అని పిలిచే ఈ కార్యాలయం చుట్టూ ముంపు నీరు చేరుకుంది. ఎస్ఈబీ సీఐ, ఎస్ఐలు ముంపు నీటిలోనే విధులకు హాజరయ్యారు.

ముమ్మిడివరం: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ముమ్మిడివరం మండలంలో పలు ప్రాంతాలు నీట మునిగాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి ఒక్కసారిగా కురిసిన భారీ వర్షాలకు ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీ, జీఎంసీ బాలయోగి కాలనీతో పాటు పలు గ్రామాల్లో కాలనీలు జలమయమయ్యాయి. మండలంలో 45.20 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలతో పంట కాలువలు, మురుగునీటి కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్స్టేషన్, సబ్ ట్రెజరీ కార్యాలయాలు నీట మునిగాయి. దీంతో సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. మురుగు కాలువల వెంబడి ఉన్న వరి పొలాలు సైతం ముంపుబారిన పడ్డాయి.



నీట మునిగిన ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం

ఐ.పోలవరం: భారీ వర్షం కారణంగా ఐ.పోలవరం మండలంలోని అనేక గ్రామాల్లో లోతట్టు కాలనీలు, పల్లపు ప్రాంతాలు, రోడ్లు నీట మునిగాయి. కేశనకుర్రు, ఐ.పోలవరం, జి.మూలపొలం గ్రామాల్లో రోడ్ల మీద అడుగు ఎత్తున నీరు చేరింది. శివారుల్లో కొబ్బరి తోటలు మునిగిపోయాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా ప్రజలు దాదాపు ఇళ్లకే పరిమితమయ్యారు. మురమళ్లలో జరిగే బుధవారం వారపు సంత వర్షాలతో వెలవెలబోయింది. మరోవైపు వరద ముంచుకొస్తుండడంతో ఏటిగట్టు దిగువున ఉన్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



జల దిగ్బంధంలో చిక్కుకున్న అమలాపురం ఎస్ఈబీ డివిజన్ కార్యాలయం



ముంపు నీటిలో అమలాపురం పట్టణం సావరం రోడ్డు

భారీ వర్షాలకు కుప్పకూలిన చెట్టు

తాళ్లరేవు: భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులకు కోరంగి ప్రధాన రహదారిలోని భారీ వృక్షం కుప్పకూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే చెట్టు రోడ్డుగా అడ్డంగా పడిపోవడం వల్ల ట్రాఫిక్కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.సత్యనారాయణ హుటాహుటిన అక్కడకు చేరుకుని యుద్ధప్రాతిపదికన కొమ్మలను నరికించి చెట్టును తొలగించి ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు.



రోడ్డుపై పడిపోయిన భారీ వృక్షాన్ని తీయిస్తున్న పోలీసులు